

## మద్దతు ధర కల్పనలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతులకు కనీస మద్దతు ధర కూడా ఇవ్వలేని స్థితిలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉందని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రానికి వెన్నెముక అయిన రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కల్తీ ఎరువులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆచరణ లేని, సాధ్యం కాని హామీలతో అన్నదాతలను ఊహల పల్లకిలో ఊరేగించిన కూటమి ప్రభుత్వం కాడి వదిలేసి చేతులెత్తేసిందని విమర్శించారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పంటలకు మద్దతు ధర అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఉడకని కందిపప్పు

**జిల్లాలోని తెల్ల రేషన్‌కార్డుదారులకు ఈనెలలోనూ కందిపప్పు అందలేదు. ప్రభుత్వం నుంచి జిల్లాకు కేటాయింపులు లేకపోవడంతో ఈనెల కూడా పంపిణీ ఆగిపోయింది. ప్రభుత్వం మారినా ప్రజా పంపిణీ వ్యవస్థ తీరు మారలేదు. వైసిపి ప్రభుత్వ హయాంలో బియ్యం, పంచదార, కొద్ది నెలలు గోధుమపిండి, రాగిపిండి పంపిణీ లబ్ధిదారులకు అందించేది. అప్పుడప్పుడూ కందిపప్పు పంపిణీ చేసే పరిస్థితి ఉండేది. తాము అధికారంలోకి వస్తే అన్నిరకాల రేషన్ సరుకులను అందించడంతో సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలను అందిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చినా సరుకులు మాత్రం పంపిణీ కాలేదు. కానుకల విషయం పక్కన పెడితే కనీసం రేషన్ సరుకులనూ సక్రమంగా పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది.**



- **లబ్ధిదారులకు ఈనెలా పంపిణీ కాని వైనం**
- **ఫిబ్రవరి నుంచి ఆగిపోయిన సరఫరా**
- **ఆరు నెలలుగా ఎదురుచూపులు**
- **ఈనెల బియ్యం, పంచదారే పంపిణీ**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 1603 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,60,740 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 19,38,377 మంది లబ్ధిదారులు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం జూన్ నుంచి మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండియు) వాహన వ్యవస్థను రద్దు చేసి రేషన్ డిపోల్లోనే సరుకులను పంపిణీ చేస్తోంది. వికలాంగులు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇబ్బంది లేకుండా ఇంటికే సరుకులను అందిస్తోంది. ఈక్రమంలో జూలైకు సంబంధించి ఐదు రోజులుగా కార్డుదారుల ఇళ్ల వద్దకే సరుకులను పంపిణీ చేస్తున్నారు.

మంగళవారం నుంచి రేషన్ డిపోల్లో సరుకులు అందజేత ప్రారంభమైనా బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలలు గోధుమపిండి పంపిణీ చేసినా, గతేడాది జనవరిలో దాన్నీ ఆపేసింది. జనవరిలో బియ్యం, పంచదార, కందిపప్పు ఇచ్చారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు బియ్యం, పంచదార మినహా ఇతర సరుకులేమీ ఇవ్వడం లేదు.

### అధిక ధరకు కందిపప్పు కొనుగోలు

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా ఆరు నెలలుగా కందిపప్పు పంపిణీ నిలిచిపోవడంతో, కార్డుదారులు బయట మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.110 నుంచి రూ.135 ఉంది. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై కేజీ రూ.67కే కందిపప్పు అందించేది. ఇది కార్డుదారులకు అధిక ధర నుంచి ఉపశమనం కలిగించేది. ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయకపోవడంతో, లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. మరోవైపు కార్డుదారులకు డీలర్లు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.

### రేషన్ పంపిణీలో సర్వర్ సమస్యలు

జిల్లావ్యాప్తంగా డిపోల ద్వారా మంగళవారం నుంచి రేషన్ సరుకుల పంపిణీ చేయాల్సి ఉండగా, చాలాచోట్ల సర్వర్ సమస్యలు తలెత్తాయి. దీంతో సరుకులు తీసుకువెళ్లేందుకు వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. జిల్లాలోని కార్డుదారులకు 96,527 క్వింటాళ్ల బియ్యం కావాలని అధికారులను ఇండెంట్ పెట్టారు. ప్రభుత్వం అందులో 93,083 క్వింటాళ్ల పంపాలని నిర్ణయించింది. అందులో ఇప్పటివరకు 91,180 క్వింటాళ్ల మేర బియ్యం చౌక ధరల దుకాణాలకు పంపింది.

మొదటి రోజు 1,63,254 మందికి బియ్యం అందించారు. ఒక్కో కార్డుదారునికి అర కేజీ పంచదార చొప్పున 5,87,580 ప్యాకెట్లు అవసరమవుతాయని అధికారులు నివేదిక పంపారు. అందులో ప్రభుత్వం 5,26,252 ప్యాకెట్లను పంపాలని నిర్ణయించింది. ఇప్పటివరకు 5,14,430 ప్యాకెట్లను చౌకధరల దుకాణాలకు పంపింది. తొలిరోజు 1,44,393 మందికి పంచదార అందించారు.



రేషన్ డిపోల్లో సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

### ఆరు నెలలుగా ఆగిన కందిపప్పు పంపిణీ

రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు ఎప్పుడు ఇస్తారో, ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబరులో 50 శాతం కుటుంబాలకు, జనవరిలో కార్డుదారులందరికీ పంపిణీ చేశారు. తర్వాత అక్కడ్నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వడమే మానేశారు. రేషన్‌లో కందిపప్పు కోసం ఆరు నెలలుగా లబ్ధిదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు.



మాట్లాడుతున్న వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం

## దళితుల సాగు భూములను ఎలా అప్పగిస్తారు?

**వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం**

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని అన్నంపేటలో దళితులు, బలహీన వర్గాల భూములపై భూస్వామి మంగపల్లి సూర్యప్రకాశరావుకు హక్కు పత్రాలు ఎలా మంజూరు చేస్తారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రశ్నించారు. అన్నంపేటలో సాగుదారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబరు 3లో దళితులు, బలహీన వర్గాలకు చెందిన 30 కుటుంబాలు 75 ఏళ్లుగా 25 ఎకరాల భూమిని తరాలుగా సాగు చేసుకుంటున్నాయని తెలిపారు. అధికార పార్టీ అండదండలతో భూస్వామి మంగపల్లి సూర్యప్రకాశరావు రెవెన్యూ అధికారులను ప్రభావితం చేసి తప్పుడు హక్కు పత్రాలు సృష్టించి కోర్టులో కేసు వేశారని ఆరోపించారు. ఇది పూర్తిగా అన్యాయమని, వాస్తవంగా సాగు చేస్తున్న ప్రజల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. డి-పట్టాలు పొందిన దళితులకు, దశాబ్దాలుగా సాగు చేస్తున్న బలహీన వర్గాల ప్రజలకు ఇప్పటికీ పూర్తి హక్కులు ఇవ్వని రెవెన్యూ యంత్రాంగం, విశాఖపట్నంలో నివసించే భూస్వామికి హక్కు పత్రాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ సాగుదారులను గుర్తించి, సాగు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దంత శ్రీరాములు, కె.అప్పలనాయుడు, సూరమ్మ, గౌరమ్మ, డి.లక్ష్మి, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న డిసిసిబి చైర్మన్, అధికారులు

## సహకార బ్యాంకుల ద్వారా మెరుగైన సేవలు

**శ్రీకాకుళం సిటీ :** సహకార బ్యాంకుల ద్వారా రైతులు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ తెలిపారు. 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి సహకార సంఘం ఆధ్వర్యాన డిసిసిబి కార్యాలయం వద్ద మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించనున్నామన్నారు. రైతులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏటా మాదిరిగానే అన్ని సహకార సంఘాల్లో సహకార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి సిఇఒ దత్తి సత్యనారాయణ, ఒఎస్‌డి శ్రీనివాస్, జిఎం డి.వరప్రసాద్, జగదీష్, డిజిఎం సత్యనారాయణ, రమేష్, ఎజిఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

## డెంగీ నివారణపై ప్రత్యేక దృష్టి

**జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లావ్యాప్తంగా ఈనెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు డెంగీ నివారణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత తెలిపారు. డెంగీపై అవగాహనలో భాగంగా నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై నెలను డెంగీ నివారణ మాసంగా పాటించాలని పిలుపునిచ్చారు. డెంగీ వ్యాప్తి సీజన్ కావడం వల్ల ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం పెంచడం, తాగునీటి కుళాయిలు, బోర్లు వద్ద చెత్త తొలగించడం, దోమలు వృద్ధి చెందకుండా నిరోధక చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

జిల్లావ్యాప్తంగా ఈనెలంతా కార్యక్రమాల నిర్వహణకు జిల్లా మలేరియా నివారణ అధికారి పి.వి సత్యనారాయణ ఆధ్వర్యాన కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైందని తెలిపారు. ఆరోగ్య శాఖ, మున్సిపల్, గ్రామీణ శాఖల సిబ్బంది సమిష్టిగా డెంగీపై అవగాహనా ర్యాలీ నిర్వహించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ వెంకటరావు, వెక్టర్ కంట్రోల్ స్పెషలిస్ట్ వెంకటేశ్వరరావు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పబ్లిక్ హెల్త్ స్టాఫ్, ఎన్‌విబిడిసిపి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## 'కొరటాల' మార్గం అనుసరణీయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతుల, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పోరాటాలు సాగించిన ప్రజాశక్తి సాహితీ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ కొరటాల సత్యనారాయణ మార్గం అనుసరణీయమని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు అన్నారు. కొరటాల వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎచ్చెర్ల మండలం నవభారత్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఎడివిటి ఇన్‌ఛార్జి బుజ్జిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రేపల్లె నుంచి శాసనసభ్యునిగా ఎన్నికై, సిపిఎంలో అంచెలంచెలుగా పొలిట్‌బ్యూరో సభ్యుని స్థాయికి ఎదిగారని తెలిపారు. శాసనసభ్యునిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే రాష్ట్రంలో రైతాంగ సమస్యలను అప్పటి ప్రధాని మనోహ్మన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారని కొనియాడారు. పత్తి, మిర్చి రైతులు, చేనేత కార్మికుల సమస్యలపై పార్లమెంటులో పోరాడి రైతుల పక్షాన నిలిచారని గుర్తుచేశారు. ప్రజాశక్తి రజతోత్సవ వేడుకల్లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పాల్గొనడం ఏ పత్రికకూ దక్కని అరుదైన గౌరవమని గుర్తుచేశారు. ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల, విషయాలపై అధ్యయనం చేయడం వంటివి కొరటాల నుంచి నేర్చుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఎ.సోమశేఖరరావు, జి.లక్ష్మణరావు, టి.భీమారావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొరటాల చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ప్రజాశక్తి ఉద్యోగులు, సిబ్బంది

## నేడు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' సమావేశం

**వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వైసిపి ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' ఇంటింటి ప్రచారంపై కార్యాచరణను రూపొందించేందుకు నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు, జిల్లా పరిశీలకులు కె.రవిబాబు హాజరవుతారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. చంద్రబాబు మేనిఫెస్టో హామీలపై ప్రజలకు వాస్తవాలను వివరిస్తూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ఐదు వారాల కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా ఆదర్శంగా నిలవాలన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకొచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, గొండు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్


**NOTICE**
**(Order-5 Rule-20)**
**IN THE HON'BLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DEVISION) AT NARASANNAPETA**
**O.S. 74/2024**

Between :-
**Mamidi Jyothi** .....Plaintiff
And :-
**Lndulige Venkata Balamani@Balamani and others** ......Defendants

To,
**D-2: Indulige Venkata Syam Kumar,** S/o Venkata Gopal rao r/o Door No.-Nil-, Narsingarayudupeta vill,Lukulam post Narasannapeta Mandal, Srikakulam District.
**D-4: Indulige Sireesha,** D/o Venkata Gopal rao r/o Door No.-Nil-, Narsingarayudupeta vill Lukulam post Narasannapeta Mandal, Srikakulam District.
**D-5: Indulige Vimsi,** S/o Siva Ram Kumar r/o Door No.-Nil-, Narsingarayudupeta vill, Lukulam post Narasannapeta Mandal, Srikakulam District.
**D-6: Lakshmi Siddardha** S/o Siva Ram Kumar r/o Door No.-Nil-, Narsingarayudupeta vill, Lukulam post Narasannapeta Mandal, Srikakulam District

Whereas in the above-mentioned suit OS.74/2004, is filed by the above named plaintiff against you and others before the above court,for specific performance of suit sale agreement and for cancellation of registered sale deed dt 24-06-2023 and for other relieves. And You are hereby summoned to appear in this Court in person or through pleader on the **9th day of July 2025, at 10 o' clock** in the forenoon, to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defence. Take notice that, in default of your appearance on the day before mentioned, the petition will be heard and determined in your absence.

**Given under my hand and the seal of the Court, this 23th day of june 2025.**
**Judge**

**C. NARASIMHA MURTHY**
**ADVOCATE**
**SRIKAKULAM, MOBILE: 9440344929.**


## ప్రభుత్వ విజయాలు వివరించాలి

**టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ**

ప్రజాశక్తి - కొత్తూరు

ఏడాది పాలనలో టిడిపి కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, వచ్చే నాలుగేళ్లలో చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ పార్టీ శ్రేణులకు సూచించారు. మండలంలోని మాతలలో తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి, ప్రజలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇందులో భాగంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి కూటమి ప్రభుత్వ విజయాలను తెలియజేయాలన్నారు. సందర్శించిన ఇంటి సభ్యులతో ఫొటో దిగాలన్నారు. కూటమి ప్రభుత్వంపై వారి అభిప్రాయాలను నమోదు చేయాలని సూచించారు. అలాగే వారి సమస్యలను తెలుసుకుని వాటినీ నమోదు చేయాలన్నారు. టిడిపి బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, గ్రామ, మండల అధ్యక్షులు, కెఎస్ఎస్ సభ్యులు తమవంతు బాధ్యత వహించాలన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వంపై వైసిపి చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## అభివృద్ధికి హబ్ మూలపేట పోర్టు

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మూలపేట పోర్టు అభివృద్ధికి హబ్‌గా మారనుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని ఉమిలాడలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంగళవారం అందజేశారు. అనంతరం రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత రహదారులు, రూ.1.67 కోట్లతో నిర్మించిన బీచ్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. రూ.57 లక్షల వ్యయంతో చేపట్టనున్న మరికొన్ని రహదారులకు శంకుస్థాపన చేశారు. మూలపేట పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం శరవేగంగా సాగుతోందన్నారు. మూలపేట పోర్టు నిర్మాణంలో భాగమైన రోడ్డు, రైలు మార్గాల వల్ల సమీప ప్రాంత వ్యవసాయ పొలాలకు ముంపు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే హల్దియా పెట్రో కెమికల్స్, ఎక్సాంబియల్ అమెరికా సంస్థలతో పాటు మరిన్ని పరిశ్రమలు ముందుకొచ్చాయని తెలిపారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మూలపేట నుంచి వేములవాడ మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రెండు నెలల్లో పోర్టు పరిసర ప్రాంతానికి షిప్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు ద్విచక్ర వాహనంపై నౌపడ నుంచి మూలపేట వరకు పోర్టు రహదారిలో పర్యటించి ఉప్పు భూములు పరిశీలించారు. రహదారి నిర్మాణాల వల్ల వరద నీటికి ఆటంకం కలిగి సమీప ప్రాంత పొలాలు ముంపునకు గురవకుండా కల్వర్టులు ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒ కృష్ణమూర్తిని ఆదేశించారు.

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. వితంతువులకు నూతన పింఛన్లు మంజూరు చేస్తూ వచ్చే నెలలో ప్రత్యేకంగా పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.



పోర్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


**MISSING**
**(ORIGINAL CERTIFICATES)**
**NOT TRACED ENQUIRY - REG.**

I am a **Medical Practioner (Ophtalmology).** Since 2002 in Illispuram, Srikakulam Town.

While, I was travelling on a scooter on dt:- 02-06-2025, in the evening at about or **7:00 or 7:30 p.m. I lost my original certificates etc.,** containing a plastic folder near forest office lane in Srikakulam Town. Despite of my best efforts, I could not trace my certificates containing a plastic folder. Therefore, I request you to please enpeaur into the matter and do needful.

Thanking you,

**Documents list:-**
1. 10th Class Original Certificate.
2. M.B.B.S Degree Original Certificate.
3. Andhra Pradesh Medical Council Registration Certificate.
4. M.S (Ophtalmology) Provisional Certificate.
5. M.S Final Year Marks list.

Yours Sincerely,

**Dr. K. SADGUNA RAJU**
**M.S. D.O.,**
**SAMATHA EYE HOSPITAL,**
**Beside Kalam's School,**
**Bondilipuram, SRIKAKULAM.**



విచారణ చేపడుతున్న డిప్యూటీ డిఇఒ విజయకుమారి

## పాఠశాలను కొనసాగించాలి

- డిప్యూటీ డిఇఒను కోరిన గ్రామస్తులు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని మారుమూల గ్రామమైన అల్లెన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి విచారణ చేపట్టారు. 'ప్రజాశక్తి'లో మంగళవారం 'మూడడుగులు సాగేదెల' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఆమె మంగళవారం పాఠశాలను సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 70 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారి భవిష్యత్ కోసం పాఠశాల నిర్వహణ అవసరమని విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేశారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు పాఠశాలను ఈ గ్రామంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే అవకాశం లేదని, ప్రభుత్వం పునర ఆలోచన చేసి అల్లెనలో యుపి పాఠశాల కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలా కొనసాగించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఆమె ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ సమస్యను స్వయంగా పరిశీలించి పాఠశాల కొనసాగించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయరావు, సింహాచలం, పాఠశాలల హెచ్ఎం ప్రతాప్, ఉపాధ్యాయులు సూర్యం, తల్లిదండ్రులు పొగిరి ఆనందరావు, దాసిరెడ్డి హరి పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆలోచనలు స్ఫూర్తిదాయకం

**ఆమదాలవలస** : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పురపాలక సంఘంలోని పదో వార్డు హడ్కో కాలనీలో నూతన అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే భారత దేశ పరిపాలన కొనసాగుతున్నదని అన్నారు. దేశ విదేశాల్లో ఈనాటికి భారతదేశ రాజ్యాంగంపై ప్రత్యేక గౌరవం ఉన్నదని అన్నారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందదాయకమని అన్నారు. ముందుగా సొట్టవానిపేటలో నూతనంగా నిర్మించిన బోరు వెల్‌ను ప్రారంభించారు. అనంతరం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నేటికీ మనందరికీ అనుసరణీయమని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, టిడిపి జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, సూరపునాయుడు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు పాల్గొన్నారు.

# బియ్యం బస్తాల్లో తరుగు

- మండల గోదాం వద్దే మాయాజాలం
- దోపిడీని అరికట్టకపోతే భరించలేమంటున్న డీలర్లు


కేశవరాయనిపాలెం డిపోలో బస్తా 47 కిలోలు చూపిస్తున్న తూకం

ప్రజాశక్తి- లావేరు

పౌరసరఫరాల శాఖలో ప్రజాపంపిణీ వ్యవస్థలో బియ్యం, పంచదార, కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులు కార్డుదారులకు ప్రతినెలా అందిస్తున్నారు. ఈ క్రమంలో మండల గోదాం నుంచి డిపోలకు వెళ్లే క్రమంలో బాగా బస్తాల్లో తేడాలు రావడంతో నష్టపోతున్నామని డీలర్లు వాపోతున్నారు. 50 కిలోల బియ్యం బస్తాలో 45, 47, 48 ఇలా ఒక్కొక్క బస్తాలో బియ్యం తక్కువ వస్తున్నాయని డీలర్లు మంగళవారం విలేకరులకు చూపించారు. అలాగే చిన్న డిపో డీలర్ నుంచి పెద్ద డిపో డీలర్లకు ప్రతినెలా 2 నుంచి 3 క్వింటాళ్ల తరుగు వస్తుందని, దీంతో చేతి డబ్బులు పెట్టుకుని బయట కొని కార్డు దారులకు ఇవ్వాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. లావేరు గోదాం నుంచి లావేరు, రణస్థలం మండలంలోని గ్రామాల్లోని రేషన్ డిపోలకు తూకం వేసి వ్యాన్లు, ట్రాక్టర్ల ద్వారా బియ్యాన్ని చేరవేస్తారు. వాహనాల్లో బస్తాలు లోడు చేసి ముందుగా ఖాళీ వాహనం కాటవేసి అంతరం లోడుతో తూకం వేస్తారు. ఆతూకం వేసినప్పుడు అక్కడ సిబ్బంది కంప్యూటర్లలో మాయాజాలం చేస్తూ... తూకంలో మోసం చేస్తున్నారని, దీంతో తమకు తక్కువ వచ్చి నష్టం వస్తోందని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ గోదాం ఇన్‌ఛార్జి పేరుకే తప్ప అక్కడ పెత్తనం కంప్యూటర్ ఓపరటర్, గోదాం వాచ్‌మెన్‌లే రాజ్యమని, వాళ్లకు ఇష్టం వచ్చినట్లు తూకం వేస్తున్నారని డీలర్లు ఆరోపిస్తున్నారు. రణస్థలం మండలం సంచాం డిపోకు 114 బస్తాలు బియ్యాన్ని డిపోకు తరలించగా, ఒక్కో బస్తాకు 2 కిలోల చొప్పున తరుగు వచ్చిందని డీలర్ వాపోతయారు. లావేరు మండలం కేశవరాయునిపాలెం డిపో నంబరు 58లో 105 బియ్యం బస్తాలు వేయగా, సంబంధిత డీలర్ మంగళవారం పంపిణీ చేసే సమయంలో బస్తా కాటపై వేశారు. ఒక బస్తా 44.150 కిలోలు, ఇంకో బస్తా 47.650 కిలోలు చొప్పున రావడంతో ఆ డీలర్ ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి గోదాం వద్ద తూకంలో మోసాలను అరికట్టి న్యాయం చేయాలని డీలర్లు కోరుతున్నారు.

# కళాసీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సూరయ్య

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కళాశీల సమస్యలు పరిష్కరించాలని కళాశీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కె.సూరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో జట్టు ముఠా కళాశీల కార్మిక సంఘం మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీలకు సమగ్ర చట్టం చేయాలన్నారు. జిల్లాలో హమాలీలు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, ఎనిమిది గంటల పని దినం ఉంటే కార్మిక చట్టాలు ఏ ఒకటి అమలు చేయడం లేదని తెలిపారు. కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఐఎల్ఒ నిబంధనలు ప్రకారం 50 కేజీల బస్తా ఉపయోగించాలన్నారు. కానీ, జిల్లాలో ఎక్కడా ఉపయోగించడం లేదని పేర్కొన్నారు. యాజమాన్యాలు కార్మికులతో అధిక బరువుల మోయించడంతో కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలన్నారు. ఏడాదికి రెండు జతల బట్టలు ఇవ్వాలన్నారు. బోనస్ అమలు చేయాలన్నారు. కార్మికశాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి కార్మిక చట్టాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులందరికీ ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. అనంతరం మండల జట్టు కళాసీ సంఘాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా మజ్జి దూరవాసులు, ఉపాధ్యక్షునిగా దారపు దామోదర్, కార్యదర్శిగా కలమట నారాయణ, వెంకటరావు, సభ్యులుగా తలగాన నారాయణ, శంకరరావు, నిరంజన్, వాకాడ చంద్రశేఖర్, కృష్ణారావు, మల్లేశ్వరరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, ఉమామహేశ్వరరావు, హరీష్, రమేష్, బుడ్డయ్య, కేశవరావు, శ్యామ్, ఆనంద్, నల్లయ్య పాల్గొన్నారు.


కవిటి : రామ్‌జీని సత్కరిస్తున్న సభ్యులు

## ఘనంగా వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి- కవిటి

ఆపదలో అండగా... ఆరోగ్యానికి నిచ్చెలిలా కవిటి సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌జీ సేవలు వెలకట్టలేనివని మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం డాక్టర్ రాంజీకి యువత ఘనంగా సత్కరించారు. కొన్నేళ్లుగా కవిటి మండల ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాంజీ సేవలను కొనియాడారు. వైద్య వృత్తిని కేవలం ఉద్యోగంగా కాక, సేవామార్గంగా చూసే వైద్యులలో రాంజీ ముందు వరుసలో ఉంటారని శేఖర్ ప్రశంసించారు. కార్యక్రమంలో మొగిలిపురి సీతారాం, బిపి రెడ్డి, పొల్లాయి మోరేసు రుద్రయ్య పాల్గొన్నారు.

**పొందూరు:** మండలంలోని తాడివలస, కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం డాక్టర్స్ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడివలసలో డాక్టర్లు నవీన్ నాగ పవన్, అనూషాలు, కింతలిలో డాక్టర్ పీల శివశంకర్‌లు కేక్ కట్ చేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయా ఆస్పత్రుల ఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, సిబ్బంది కలిసి వైద్యాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.


పొందూరు : మొక్క నాటుతున్న వైద్యాధికారులు



వైద్యులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

## 'హర్షవల్లి' సేవలు అమోఘం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

హర్షవల్లి లయన్స్‌క్లబ్ సేవలు అమోఘమని వైద్యులు కొనియాడారు. పట్టణంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రజలకు సేవలందిస్తున్న వైద్యులు కింజరాపు అమ్మన్నాయుడు, చింతాడ కృష్ణమోహన్, మేడిశెట్టి స్వరూప్, ప్రశాంత్, వెంకటేష్, రవితేజ, భార్గవ్‌లకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం పూర్వ అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథ నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్ మాట్లాడుతూ భవిష్యత్‌లో వివిధ రంగాల మిలిత వైద్య శిబిరాలను హర్షవల్లి లయన్స్ క్లబ్ ద్వారా పట్టణం, పరిసర ప్రాంతాల్లోనూ నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పూర్వ జెడ్‌సి లయన్స్ కరణం శోభారాణి, ఎక్స్టెన్షన్ ప్రెసిడెంట్ హారికాప్రసాద్, కార్యదర్శి పార్వతీశ్వరరావు, ట్రెజరర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, మణిశర్మ, లక్ష్మీకాంత్, నిహార్, కల్లేపల్లి ఉషారాణి, జ్యోతిర్మయి, చంద్రమోహన్, పాలిశెట్టి మధుబాబు, లయన్ మీసాల మాధవి, గణపతి పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

## రైతు సంక్షేమమే ధ్యేయం

### వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం టెక్కలిలో రైతులకు ఉచితంగా విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు రాయితీపై యంత్రాలను పంపిణీ చేశామని చెప్పారు. శివారు భూములకు సైతం ఈ ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థికసాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఎడిఎగా రామారావు


రామారావు, ఎడిఎ

**పలాస** : వ్యవసాయశాఖ సహాయ సంచాలకులుగా మండేల రామారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లిలో ఎడిఎగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎడిఎ ఎల్.వి.మధు నరసన్నపేట బదిలీపై వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రామారావు విలేకలతో మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ అన్ని రకాల సేవలు అందిస్తానని తెలిపారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమకు సంప్రదిస్తే తక్షణమే వారి సమస్యన పరిష్కరిస్తానని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


సన్మానిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

## రగ్బీ క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కర్నూల్ జిల్లాలో గత నెల 28,29 తేదీల్లో నిర్వహించిన అండర్-18 మహిళా రగ్బీ పోటీలో తిరుమల జూనియర్ కాలేజ్ విద్యార్థులు బి.గీతిక, కె.షాలినిలు సత్తా చాటారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన గీతిక స్టేట్ లెవెల్ నుంచి నేషనల్ లెవిల్‌కు ఎంపికైంది. షాలిని స్టేట్ లెవెల్‌లో మెడల్ సాధించింది. ఇద్దరిని ప్రిన్సిపాల్ వి.టి.నాయుడు, డైరెక్టర్లు ఎం.గౌరీశంకర్, పి.హేమసుందర్, పి.భాగ్యలక్ష్మి మంగళవారం అభినందించి సన్మానించారు. గీతిక ఈనెల 5న డెహ్రాడూన్‌లో జరగబోయే అండర్-18 రబ్బీ పోటీలో పాల్గొనుంది. ఈ మేరకు సాధన చేస్తుంది.

## రక్తదాతలు... ప్రాణదాతలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన మంగళవారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పైడి సిందూర మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణ దాతలని, రక్తకొరత కారణంగా ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా గాయత్రి కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, టెక్కం రామ్‌గోపాల్, చరణ్, అడప, శాంతి, బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ అప్పలనాయుడు

## డాక్టర్లకు ఎంపీ కలిశెట్టి శుభాకాంక్షలు

**శ్రీకాకుళం సిటీ** : శ్రీకాకుళం నగరంలోని కిమ్స్‌లో మంగళవారం జాతీయ డాక్టర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొని డాక్లర్లను అభినందించారు. అనంతరం కిమ్స్ డైరెక్టర్ గూడెం సోమేశ్వరరావుతో పాటు డాక్లర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో వైద్యులకు ప్రత్యేక స్థానం, గౌరవం ఉందని ఆయన అన్నారు.

## 'త్యాడి'కి మాతృవియోగం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పదో వార్డు మాజీ కౌన్సిలర్, టిడిపి నాయకులు చంద్రశేఖర త్యాడి మాతృమూర్తి వేణమ్మ (86) మంగళవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమె భర్త కలియా త్యాడి కాశీబుగ్గ పంచాయతీ ఉప సర్పంచ్‌గా వ్యవహరించారు. వేణమ్మ మృతిపై జై జగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం సభ్యులు రవీంద్రనాథ్ బ్రహ్మ, బబుల పండ, రాఘవ పండ, ప్రసాద్ పాత్రో, తంగుడు రమేష్, సుధాకర్ తదితరులు సంతాపం తెలిపారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

## 'కళా'కు జన్మదిన శుభాకాంక్షలు

**రణస్థలం:** విజయనగరం జిల్లా చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. రణస్థలం మండల టిడిపి నాయకులు కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మండపాక కనకారావు, శివాజీ, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# సైన్స్‌పై పట్టు ఉంటే అవకాశాలు సొంతం


ధ్రువపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి- నరసన్నపేట

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌పై పట్టున్నవారు మేటి అవకాశాలు సొంతం చేసుకుంటారని సిఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. పద్మావతి జూనియర్ కళాశాలలో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం ద్వారా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు మంగళవారం ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో సాంకేతికతదే అగ్రస్థానమని, అందులోనూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ ముందు ఉంటాయని అన్నారు. పద్మావతి జూనియర్ కళాశాల మద్రాస్ ఐఐటితో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగస్వామి కాండం సంతోషంగా ఉందన్నారు. డేటా సైన్స్‌కు సంబంధించి డేటాను అధ్యయనం చేయడం, డేటాను విశ్లేషించడం, ప్రోగ్రామింగ్ తదితర వినూత్నమైన అంశాలను ఈ శిక్షణ కార్యక్రమంలో పొందుపరిచారని విద్యార్థులు సిఐకు తెలియజేశారు. విద్యార్థులు ఇంజినీరింగ్ రంగంలోకి అడుగుపెట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పించడం, తగిన మార్గదర్శకత్వాన్ని అందించామని కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ వివరించారు. ఇంజినీరింగ్ ప్రపంచంతో విద్యార్థులు అనుసంధానం కావడానికి అవసరమైన వాస్తవిక అనుభవాలను అందించడంలో ఐఐటి మద్రాస్ ఈ కోర్సు రూపొందించామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.రాంబాబు పాల్గొన్నారు.

## ప్రయాణం సాగేదెలా?


అవస్థలు పడుతున్న ద్విచక్ర వాహనదారుడు

ప్రజాశక్తి- పొందూరు

వర్షపునీటితో నిండిన గుంతలలో అవస్థలు పడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణాలు సాగిస్తున్న ఈ దృశ్యం పొందూరు మండలంలోని అచ్చిపోలవలస కూడలి సమీపంలోనిది. కింతలి-తోలాపి రహదారిలోని అచ్చిపోలవలస కూడలిలో నారాయణపురం కుడికాలువ వంతెన వద్ద రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. ఈ రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు గంతలు కారణంగా ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇదే రహదారిపై స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు నిత్యం ఇదే రహదారిలో ప్రయాణాలు సాగిస్తుంటారు. కానీ, ఈ గుంతలను పూడ్చేందుకు ఎవరూ చర్యలు చేపట్టకపోవడంపై పలు గ్రామాల ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళం వెళ్లేందుకు ఇది తక్కువ దూరం కావడంతో పొందూరు, సంతకవిటి, జి.సిగడాం, రాజాం మండలాలకు చెందిన ప్రజలు ఇదే రహదారిపై నిత్యం ప్రయాణాలు చేస్తుంటారు. ఈ ప్రయాణాలు సమయంలో గుంతలు కారణంగా ప్రమాదాలు బారిన పడుతున్నామంటూ పలువురు వాపోతున్నారు. ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకుని రహదారిపై గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు కోరుతున్నారు.

# దేశ సేవకునికి ఘన స్వాగతం


స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని టి.బరంపురానికి చెందిన తిప్పన పురుషోత్తంరెడ్డి 28 ఏళ్లుగా ఆర్మీ ఉద్యోగం చేస్తూ... దేశ రక్షణలో భాగమయ్యారు. ఈ మేరకు సోమవారం ఉద్యోగ విరమణ పొంది మంగళవారం కుటుంబ సభ్యులతో గ్రామానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు గ్రామ పొలిమేర నుంచి నుంచి సభా వేదిక వరకూ భాజీ భజంత్రాలతో, హరిపురం అసరమ్మ తల్లి కోలాట బృందం, కళ్యాణ వెంకటేశ్వర జానపద కోలాట బృందంతో, బాణసంచా కాల్చుతూ ఊరేగింపుగా వచ్చారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు జవాన్ కుటుంబ సభ్యులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి ఎంపిపిలు బోర పుష్ప, పైల దేవదాస్‌రెడ్డి, ఒడిశా పాత్రపురం బ్లాక్ చైర్మన్ ఎదురు మోహనరావు, టి.బరంపురం సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, బి.నౌగం సర్పంచ్ మురపాల తొంకయ్య, మహతి సాంస్కృతిక కళాశాల సంస్థ అధ్యక్షులు రంగాల జానకి రామ్ రెడ్డి పాల్గొన్నారు.


బాధితుల పొలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

# జవాన్ కుటుంబానికి మంత్రి లోకేష్ భరోసా

### ఫోన్‌లో మాట్లాడిన మంత్రులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని చినసానకు చెందిన జవాన్ రొక్కం అశోక్‌కుమార్ కుటుంబానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయులు భరోసా ఇచ్చారు. జవాన్ జమ్ము కాశ్మీర్‌లో విధి నిర్వహణలో ఉన్నారు. అదే గ్రామానికి రొక్కం కరుణాకర్, రొక్కం వరప్రసాద్‌లు మా సొంత భూమిని స్థానిక వైసిపి నాయకుల అండతో దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని సాగుచేస్తున్నారని, దీనిపై ప్రశ్నించిన మా తల్లిదండ్రులు శివాజీ, సుగుణమ్మలను బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారని సామాజిక మాధ్యం ఎక్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు పోస్టు చేసి విన్నవించారు. లోకేష్ స్పందించి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిటి ప్రసాదరావు, ఆర్ఎస్ఐ పవిత్రి, విఆర్ఒ అకిల్లు సోమవారం రాత్రి గ్రామానికి వెళ్లి జవాన్ తల్లిదండ్రులతో మాట్లాడారు. వారి ఫిర్యాదులు రికార్డును చేశారు. అలాగే స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి జవాన్ తల్లిదండ్రులతో మాట్లాడి, సంబంధిత పొలాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అలాగే మంత్రులు జవాన్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. మీ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం

**మెళియాపుట్టి:** మెళియాపుట్టి మండలంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు జన్మదిన వేడుకలు మాజీ ఎంపిపి సలాన మోహనరావు ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు తన సొంత నిధులతో 80 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు రవ్వల గణపతిరావు, బొచ్చు ప్రసాదరావు, బసవ పరమేశ్వర్‌రెడ్డి, కదంబల పైడిరాజు, ఎల్లంనాయుడు, ఖగేశ్వరరావు, వల్లభరావు, తిరుపతి, కూర్మారావు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మోహనరావు

# ఘనంగా వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట ఎల్ఐసి కార్యాలయంలో అఖిల భారత ఉద్యోగులు సంఘం 75వ సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంగా మంగళవారం వజ్రోత్సవ వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేశారు. ఉద్యోగుల సంఘం ఆవిర్భావం, వాటి ప్రాముఖ్యత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ ఆచార్యులు, బి.రాంబాబు, ఎస్.గోపాలకృష్ణ, కె.సుధీర్, ఎల్.శ్రీనిధి, ఆర్.సురేష్‌బాబు, సీనియర్ మేనేజర్ ఎం.తాతాజీ, డిఒ పార్థసారథి పాల్గొన్నారు.

**పలాస** : ఎస్ఐసి సంస్థలో ఎఐఐఇఎ సంఘంతోనే ఉద్యోగుల సమస్య పరిష్కారం అవుతున్నాయని అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సుబ్బారావు, జె.మాధవరావు అన్నారు. కాశీబుగ్గ ఎస్ఐసి కార్యాలయం వద్ద ఉద్యోగుల ఎఐఐఇఎ సంఘం 75 వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అధ్యక్షుడు మాధవరావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. సీనియర్ సభ్యులు కరువయ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలాస ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ టి.బిసాయ్, ఎబిఎంలు రాజా గణపతి, సురేష్, సభ్యులు ఆఫ్షో, చిన్నంనాయుడు, గెదెల మోహన్, వై.కృష్ణ, హైమా పాల్గొన్నారు.



నరసన్నపేట : మాట్లాడుతున్న సురేష్‌బాబు

## శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థినులు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు, శక్తి యాప్ ఇన్‌ఛార్జి ఎస్ఐ జి.వాసుదేవరావు అన్నారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ అనే అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. వివిధ రకాల నేరాలు, స్వీయ రక్షణ, మెలకువపై శక్తి యాప్ ఇన్‌చార్జి ఎస్ఐ అవగాహన కల్పించారు. అవసరాలకు అనుగుణంగా యాప్‌లో పేర్కొన్న ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమాచారం అందుకున్న పోలీసులు సకాలంలో స్పందించి సహాయపడతారన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ఎలా స్పందించాలో డిజిటల్ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులతో మాక్ డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్, ప్రోగ్రాం అధికారి జలుమూరు రవిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వాసుదేవరావు

**లావేరు** : మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. అపరిచితులను ఎవరినీ నమ్మకూడదని, చీకటి ప్రదేశాల్లో, నిర్జన ప్రాంతాల్లో ఒంటరిగా ప్రయాణించ కూడదని శక్తి టీమ్ సభ్యులు ఉమారాణి తెలిపారు. ప్లే స్టోర్ నుండి శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్లు 181, 112, 1091, 1098, 1930, 1972 గురించి వివరించారు.

**టెక్కలి రూరల్** : స్థానిక బిఎస్‌జెఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై శక్తి టీమ్ బాలకృష్ణ అవగాహన కల్పించారు.

## సేవలే గుర్తింపునిస్తాయి

**పోలాకి** : ప్రతి ఉద్యోగి వారు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని కోడూరు మండల ప్రాదేశిక సభ్యులు పైల మల్లేశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు కరుకోల రమేష్‌బాబు, చింతాడ ఉమామహేశ్వరరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరులో ఉద్యోగ విరమణ చేసిన తెలుగు ఉపాధ్యాయులు గుంటముక్కల ప్రసాదరావు ఆత్మీయ అభినందన సభ హెచ్ఎం జి.శాంతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ హెచ్ఎం ఎ.వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఎపిటిఎఫ్ రాష్ట్ర సహధ్యక్షులు దిలీప్‌కుమార్, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ చింతాడ గున్నమ్మ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


పలాస : రైతులకు సూచనలు ఇస్తున్న ఎడిఎ రామారావు


కవిటి : అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీదేవి


ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

# మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

**ప్రజాశక్తి- పలాస**

ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ అధికారులు సూచనలు, మెలకువలు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఎడిఎ మండేల రామారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాటీలో పరిధిలోని మెగిలిపాడు, మండలంలోని ఖైజోల గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ సాగు భూములను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎదలు వేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఒ పోలారావు, చింతాడ శారద, రాధ పాల్గొన్నారు.

**కవిటి:** మండలంలోని శిలగాం, బెలగాం గ్రామాల్లో మంగళవారం 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంటల నిర్వహణపై మేదస్సును చిగురింపజేస్తూ వ్యవసాయశాఖ అధికారులు శ్రద్ధగా అవగాహన కల్పించారు. రైతులు శాస్త్రీయ విధానాలను అవలంబించాలన్న సందేశం ఇస్తూ, పంటల నిర్వహణలో జరిగే సాధారణ తప్పిదాలపై స్పష్టతనిచ్చారు. అందులో భాగంగా గట్లపై కంది సాగు, వరి నారుమడి యాజమాన్యం, జీడీ తోటల్లో కొమ్మ కత్తిరింపుల తీరుపై శాస్త్రీయమైన వివరాలు ఇచ్చారు. వ్యవసాయ అధికారి శ్రీదేవి నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ లలిత, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** పచ్చి గడ్డి విత్తనాలు వినియోగం మట్టిలో కార్బన్ శాతం పెరిగేందుకు దోహదం చేస్తాయని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీ శంకరరావు, వ్యవసాయ అధికారి పి.పి.వి.వి.అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొళ్లిగాం, బెల్లుపడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సాంకేతికతల్లో భాగంగా డ్రోన్ల సహాయంతో తెగుళ్ల నివారణ, ద్రవ ఎరువుల పిచికారీ విధానాన్ని ప్రదర్శించారు. ధాన్యం సాగులో అనుసరించవలసిన నిర్వహణ పద్ధతులు గురించి వివరించారు. సకాలంలో విత్తనాల నాటడం, తెగుళ్ల నివారణకు ప్రాథమిక చర్యలు, మట్టిని బట్టి నత్రజని ఎరువుల సమతుల్య వినియోగం, నత్రజని విడతల వారీగా ప్రయోగంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వచ్చే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

**నందిగాం :** మండలంలోని హరిదాస్‌పురంలో ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ పొలంపిలుస్తోంది కార్యక్రమ నిర్వహించి యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు.

**కోటబొమ్మాళి:** మండలంలోని ఎత్తురాలుపాడులో ఎఒ ఎస్.గోవిందరావు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి వరి ఎదలో కలుపు నివారణ పద్ధతులు పాటించాలని అవగాహన కల్పించారు.


ప్రమాదకరంగా ఉన్న పూడిక కుప్పలు

## ప్రమాదకరంగా పూడిక కుప్పలు

**ప్రజాశక్తి- లావేరు**

మండలంలోని చీపురుపల్లి-శ్రీకాకుళం వెళ్లే రహదారి వినాయక ఆలయం నుంచి చర్చి వరకు రహదారికిరువైపులా కాలువల్లో పూడికలు ఇటీవల తొలగించారు. వాటిని రోడ్డు కిరువైపులా దిబ్బలు దిబ్బలుగా వేసి వదిలేశారు. దీంతో బస్సులు, లారీలు, ఇతర వాహనాలు తప్పుకోవడానికి చోటు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి గత కొన్ని నెలలుగా రహదారి కిరువైపులా పూడిక దిబ్బలు తొలగించలేదు. ఆర్అండ్‌బి అధికారులు, పంచాయతీ పాలకులు తమకేపట్టదేమి అన్నట్లుగా వ్యవహరించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికిరువైపులా ఉన్న పూడిక దిబ్బలు తిలగించే చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారణకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

## డిఇఒ ఆకస్మిక తనిఖీ

**ఇచ్ఛాపురం:** మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రభుత్వ పాటశాలల్లో డిఇఒ సదాశివుని తిరుమల చైతన్య మంగళ వారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎపి మోడల్ స్కూల్, హాస్టల్, ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బోధనా పద్ధతులు, భోజన పదార్థాలను రుచి చూశారు. ఎపి మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థులతో అల్పాహారం చేసి రుచి చూశారు. ముచ్చింద్ర పాఠశాలలో ప్రార్థన సమయానికి పరిశీలించారు. ఈయన వెంట ఎంఇఒలు అప్పారావు, విశ్వనాథం, హెచ్‌ఎం బి.అరుణకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## సమస్యల పరిష్కారానికి వినతి

**ఇచ్ఛాపురం :** మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డు లాలపేట మసీదు రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మసీదు పక్కన రోడ్డు దుస్థితిని వివరించారు. విప్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రమేష్ వినతిపత్రం అందజేశారు. త్వరలో రోడ్డు పనులు చేపడతామని కమిషనర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్, ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ జిలాని, వార్డు ప్రెసిడెంట్ బుగ్గత వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం

**నరసన్నపేట :** నరసన్నపేట మండలంలోని చోడవరం ఎంపిపి స్కూల్‌లో పనిచేసిన రాజాపు దమయంతి బదిలీపై వి.ఎన్.పురం వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఆదినారాయణ, భూషణ్‌రావు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి**

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని మూల సవళాపురంలో సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల యోగక్షేమాలను కనుక్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు లబ్ధిదారులకు అందిస్తుందని తెలిపారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, ఎంపిడిఒ ఎం.పావని, టిడిపి నాయకులు అంబల్ల రాంబాబు, నందివాడ గోవిందరావు, పల్లి సురేష్, తర్లాడ సురేంద్ర, దవళ సింహాచలం పాల్గొన్నారు.


సరుబుజ్జిలి : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


శ్రీకాకుళం : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

**శ్రీకాకుళం సిటీ :** శ్రీకాకుళం నగరంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే గొండు శంకర్ పంపిణీ చేశారు. అనంతరం దమ్మల వీధిలో రోడ్లను, డ్రెయినేజీలను పరిశీలించి రూ.2.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎడి నర్సింహులు

## నట్టల నివారణ మందులు తప్పనిసరి

**కోటబొమ్మాళి:** మండలంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తప్పనిసరిగా వేయించుకోవాలని టెక్కలి పశుసంవర్ధక ఉప సంచాలకులు చంద్రక నరసింహులు అన్నారు. మండలంలోని పాకివలస, యరకయ్యపేట గ్రామాల్లో చేపడుతున్న నట్టలనివారణ మందులను మంగళవారం పంపిణీ చేశారు. అంతకుముందు మండలంలోని కురుడు పశువైద్య కేంద్రాన్ని స్థానిక పశువైద్య సహాయ సంచాలకులు మంద లోకనాథంలో కలిసి సందర్శించి పలు రికార్డు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టెక్కలి డివిజన్‌లో మొత్తం 5,27,692 సన్నజీవాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు సుమారు 93,823 జీవాలకు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎల్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

# పశు దాణా పంపిణీ

**ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు**

పాడి రైతులు ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు సురాడ మోహనరావు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు చంద్రశేఖరరావు అన్నారు. స్థానిక పశువుల ఆస్పత్రి వద్ద పాడి రైతులకు రాయితీపై పశువులు దాణాను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి ఉత్పత్తి రైతుల ఆదాయం పెంచడం కోసం ప్రభుత్వం 50 రాయితీపై దాణా అందజేస్తుందని తెలిపారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. పాడి పశువులకు గోశాలలు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో అరసవల్లి ఉమామహేశ్వరరావు, బగాది రాజారావు, షణ్ముఖరావు, పీత శంకరరావు, పశు వైద్యాధికారి మెట్ట పాపారావు, డాక్టర్ మధుబాబు, సిబ్బంది దేవేంద్ర, అరుణ్ పాల్గొన్నారు.

**మందస :** మందసలో పశువులు దాణాను పలాస ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మట్ట రవికృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందస, హరిపురం పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతి, నాయకులు పాల్గొన్నారు.


శుభ్రం చేస్తున్న సిబ్బంది

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

**ప్రజాశక్తి- జలుమూరు**

జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి జి.సుజాత, సంధారాణి పర్యవేక్షణలో సిబ్బంది సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. కెజిబివి, బిసి వెల్ఫేర్ హాస్టల్, కురవంజి మోడల్ స్కూల్‌లోను మంగళవారం పరిశుభ్రత చేయించారు. డెంగీ, మలేరియా, విషజ్వరాలు రాకుండా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే మరుగుదొడ్లు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ అదికారి కె.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది చిన్నరాజులు, చిన్నారావు, లక్ష్మీబాయి, శ్రావణి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# చేతి బోరును కప్పేశారు...

**రణస్థలం:** రణస్థలం మండల కేంద్రంలోని సినిమా థియేటర్‌కి వెళ్లే రోడ్డులో ఉన్న చేతి బోరును కప్పేశారు. దీంతో ఆ ప్రాంత వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారుగా 30 గృహాలకు చెందిన వారు ఈ చేతి పంపు నీరునే వాడుకుంటున్నారు. ఈ ప్రాంత వాసులకు ఈ చేతిపంపే ఆధారం. ఇటీవల రోడ్డు వేయడం, నూతనంగా గృహాలు నిర్మాణం చేస్తున్నవారు ఇసుక, పిక్క తదితర మెటిరీయల్ వేయడంతో బోరు కనిపించకుండాపోయింది. తక్షణమే సంబంధిత అధికారులు, పంచాయతీ సర్పంచ్ స్పందించి ఈ చేతి పంపుకి మరమ్మతులు చేపట్టి వాడుకులోనికి తేవాలని స్థానికులు కోరుతున్నారు.


మరమ్మతులకు గురైన చేతిపంపు